





విద్యుత్ వెలుగుల్లో ఆదిత్యుడి ఆలయం

ఓం భాస్కరాయ నమః

- అరసవల్లిలో రథసప్తమి వేడుకలు ప్రారంభం
- నేత్రపర్వంగా ఆదిత్యుడి నిజరూప దర్శనం
- పోటెత్తిన భక్తజనం



రథసప్తమి వేడుకలకు ముస్తాబైన ఆదిత్యుడి ఆలయం

అరసవల్లి/శ్రీకాకుళం క్రైం, ఫిబ్రవరి 15: అరసవల్లిలో రథసప్తమి వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. వెలుగులరేడు జన్మదినాన్ని పురస్కరించుకుని.. గురువారం సాయంత్రం నుంచి భక్తులు అరసవల్లికి పోటెత్తారు. ప్రత్యక్షదైవం ఆదిత్యుడు.. భక్తులకు క్షీరాభిషిక్తుడిగా దర్శనమిచ్చారు. గురువారం అర్ధరాత్రి ఆదిత్యుడి మూలవిరాట్‌కు క్షీరాభిషేకం నిర్వహించి.. ప్రత్యేక పూజలు చేశారు. శుక్రవారం ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 4 వరకు ఆదిత్యుడు నిజరూపంలో భక్తులకు దర్శనమివ్వనున్నారు. అనంతరం స్వామిని పుష్పాలతో అలంకరించి భక్తులకు రాత్రి 11 గంటల వరకు దర్శనానికి అనుమతిస్తారు. అనంతరం పవళింపు సేవతో రథసప్తమి వేడుకలు ముగుస్తాయి. ఈ నేపథ్యంలో గురువారం రాత్రి అధికసంఖ్యలో భక్తులు అరసవల్లి చేరుకున్నారు. క్యూలో బారులుదీరి 'ఓం ఆదిత్యాయ నమః, ఓం భాస్కరాయ నమః' అంటూ ఆదిత్యుడ్ని దర్శించుకున్నారు. దాతలు, వీఐపీ టికెట్ తీసుకున్నవారు, సామాన్య భక్తులతో అంతటా సందడిగా మారింది. మరోవైపు ప్రజాప్రతినిధులు కూడా కుటుంబ సభ్యులతో కలిసి ఆదిత్యుడ్ని దర్శించుకున్నారు.

అరకొర ఏర్పాట్లతోనే సరి

రథసప్తమి వేడుకలకు సంబంధించి అరకొరగానే ఏర్పాట్లు కనిపించాయి. గురువారం రాత్రి నాటికి ఆలయానికి విద్యుత్ దీపాల అలంకరణ తప్ప.. క్యూలైన్లు ఏర్పాటు పూర్తికాలేదు. ఎటువంటి సూచికబోర్డులు లేకపోవడంతో.. ఎవరిని అడగాలో తెలియక భక్తులు అయోమయం చెందారు. ఆలయ ఈవో చాంబర్‌కు మాత్రమే పరిమితమై ఆదేశాలు జారీ చేస్తుండడంతో.. బయట క్షేత్రస్థాయిలో ఏర్పాట్లు సక్రమంగా లేవని, పర్యవేక్షించే వారు కరువయ్యారని పలువురు భక్తులు ఆరోపిస్తున్నారు. సింహద్వారం ఎదురుగా పోలీసు కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు. ఎక్కడ చూసినా పోలీసులే తప్ప.. ఏర్పాట్లకు సంబంధించి ఆలయ సిబ్బంది ఎక్కడా కానరాకపోవడం గమనార్హం. ఆలయ సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా ఈ ఏడాది భక్తులకు ఇబ్బందులు ఎదురయ్యే పరిస్థితి కనిపిస్తోంది.

పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు

శ్రీకాకుళం క్రైం: అరసవల్లిలో రథసప్తమి వేడుకలకు పటిష్ఠ బందోబస్తు ఏర్పాట్లు చేశామని ఎస్పీ జీఆర్ రాధిక తెలిపారు. గురువారం ఆలయ ప్రాంగణంలో ఏర్పాట్లను ఆమె పరిశీలించారు. అరసవల్లి తోటలో పోలీసు అధికారులు, సిబ్బందికి ఆమె దిశానిర్దేశం చేశారు. భక్తులకు అసౌకర్యం కలుగకుండా విధులు నిర్వర్తించాలని ఆదేశించారు. వృద్ధులు, దివ్యాంగులు ప్రత్యేక క్యూలైన్‌లో దర్శనం చేసుకునేలా చూడాలన్నారు. 'శ్రీకాకుళం 80 అడుగుల రహదారికి ఇరువైపులా ద్విచక్ర వాహనాలు, ఆటోలు, కార్లు, బస్సులు పార్కింగ్ చేసుకునేలా ఏర్పాట్లు చేశాం. దాతలు, వీఐపీ, వీవీఐపీలకు ప్రత్యేక దర్శన మార్గాలు కేటాయించాం. ఇద్దరు ఏఎస్పీల పర్యవేక్షణలో 9 మంది డీఎస్పీలతోపాటు మొత్తం 1,300 సిబ్బందితో బందోబస్తును రెండు సెక్టార్‌లుగా విభజించాం. ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామ'ని ఎస్పీ తెలిపారు. కార్యక్రమంలో ఏఎస్పీలు జి.ప్రేమ కాజల్, బి.ఉమామహేశ్వరావు, డీఎస్పీలు వై.శృతి, డి.బాల చంద్ర రెడ్డి, ఏ.విజయకుమార్, ఎం.వీర కుమార్, ఎస్.ఆర్.హర్షిత, ఆర్.శ్రీనివాసరావు, విశ్వ నాథం, సీఐలు సిబ్బంది పాల్గొన్నారు.



ఏర్పాట్లపై సూచనలిస్తున్న ఎస్పీ రాధిక



అరసవల్లిలో గురువారం అర్ధరాత్రి ఆదిత్యుడి దర్శనం కోసం భక్తుల నిరీక్షణ



లావేరులోని శంఖారావం సభలో మాట్లాడుతున్న నారా లోకేశ్, హాజరైన ప్రజలు, టీడీపీ-జనసేన శ్రేణులు

అక్రమాల కిరణ్‌కుమార్



- ఎచ్చెర్ల ఎమ్మెల్యేకి అన్నింటిలోనూ వాటాలే
- ప్రభుత్వ స్థలాలను దోచేసుకుంటున్నారు
- అధికారంలోకి రాగానే కచ్చితంగా చర్యలు
- జిల్లా అభివృద్ధికి బాధ్యత వహిస్తా
- యువతకు ఉద్యోగావకాశాలు కల్పిస్తాం
- శంఖారావం సభలో నారా లోకేశ్



ఎన్టీఆర్ విగ్రహానికి నివాళి అర్పిస్తున్న లోకేశ్, కళా వెంకటరావు

(ఆంధ్రజ్యోతి-శ్రీకాకుళం)

'వైసీపీ పాలనలో అంతటా అవినీతిమయమే. ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్‌కు అక్రమాలన్నింటిలోనూ వాటాలే. ఇసుక అక్రమాల్లో రూ.50 కోట్లు, కంకర తవ్వకాల్లో రూ.75 కోట్లు, విలువైన ప్రభుత్వ స్థలాలు, వివాదస్పద స్థలాలు దోచుకున్నారు' అని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మాజీమంత్రి నారా లోకేశ్ ఆరోపించారు. గురువారం ఎచ్చెర్ల నియోజకవర్గం లావేరు మండల కేంద్రంలో నిర్వహించిన శంఖారావం సభలో ఆయన మాట్లాడుతూ.. వైసీపీ నేతల అక్రమాలపై ధ్వజమెత్తారు. దమ్ము, ధైర్యం ఉంటే వైసీపీ పాలనలో జరిగిన అవినీతిపై చర్చకు రావాలని సవాల్ విసిరారు. ఎచ్చెర్ల ఎమ్మెల్యే కిరణ్‌కుమార్ ఓ వైపు అక్రమాలతో పాటు మరోవైపు సొంతపార్టీ శ్రేణులపై ఎంపీపీతో కలిసి దాడులకు పాల్పడడం అన్యాయమన్నారు. 'టీడీపీ హయాంలో ఎచ్చెర్ల నియోజకవర్గాన్ని కళా వెంకటరావు ఎంతో అభివృద్ధి చేశారు. వైసీపీ పాలనలో అభివృద్ధి లేక పోగా.. అవినీతి అక్రమాలు చోటుచేసుకుంటున్నాయి. జిల్లాకు సీఎం జగన్ ఇచ్చిన హామీలు ఒక్కటీ నెరవేర్చలేదు. రోడ్లు ఎక్కడ చూసినా అధ్వానంగా ఉన్నాయి. టీడీపీ అధికారంలోకి వస్తే జిల్లాను అభివృద్ధి చేసే బాధ్యత నాది. చంద్రబాబు -పవన్ కల్యాణ్ ప్రవేశపెట్టిన సూపర్ సిక్స్ పథకాలను ప్రజలు గమనించాలి. రానున్న ఎన్నికల్లో టీడీపీ-జనసేనను గెలిపించాలి. వైసీపీని సాగనంపాలి' అని లోకేశ్ పిలుపునిచ్చారు. 'టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు స్కిల్‌డెవలప్‌మెంట్ కేసులో అక్రమంగా అరెస్టు అయిన సమయంలో.. వైసీపీ ప్రభుత్వ తీరుకు నిరసనగా ఎచ్చెర్ల నియోజకవర్గం నుంచి రామకృష్ణ అనే వ్యక్తి సిక్కోలు నుంచి చిత్తూరు వరకు సైకిల్ యాత్ర నిర్వహించారు. పాపాల పెద్దిరెడ్డి అనుచరులు అతనిని అడ్డుకుని భయభ్రాంతులకు గురిచేశారు. చంద్రబాబుకు మద్దతు తెలిపే.. జనసేన అధినేత పవన్‌కల్యాన్ పర్యటనను కూడా వైసీపీ అడ్డుకుంది. ఆనాడే జగన్ సర్కార్‌ను ఇంటికి పంపించేయాలనే లక్ష్యంతో పవన్ సిద్ధమయ్యారు. టీడీపీ శ్రేణులను వేధించిన వారిని, అవినీతికి పాల్పడిన నాయకులను, అధికారుల పేర్లను రెడ్‌బుక్‌లో రాస్తున్నా. చట్టాన్ని ఉల్లంఘించినవారిని విడిచిపెట్టేది లేదు. అధికారంలోకి వచ్చాక విచారణ చేసి అక్రమార్కులపై చర్యలు తీసుకుంటాం. ఉత్తరాంధ్ర సాక్షిగా నిరుద్యోగ యువతకు హామీ ఇస్తున్నా. ప్రత్యేక సెజ్ ఏర్పాటు చేసి.. పరిశ్రమల ద్వారా ఉపాధి అవకాశాలు కల్పిస్తాం. మత్స్యకారులకు, బీసీలకు రద్దుచేసిన పథకాలను పునరుద్ధరిస్తాం. వంశధార ఎడమ ప్రధాన కాలువ పనులను చేపడతాం. తోటపల్లి కాలువల పనులు పూర్తిచేయిస్తాం. అంబేడ్కర్ యూనివర్సిటీ స్టేడియం నిర్మిస్తాం. ప్రతి ఇంటికీ ఉచితంగా కుళాయి కనెక్షన్ ఇస్తాం. బుడగట్ల పాలెం వద్ద జెట్టీని పూర్తిచేయిస్తామ'ని లోకేశ్ హామీ ఇచ్చారు. అనంతరం మాజీమంత్రి, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు కళావెంకటరావుతో కలిసి కార్యకర్తలు, ప్రజలతో ప్రతిజ్ఞ చేయించారు. సభకు వేలాది మంది ప్రజలు, టీడీపీ-జనసేన నాయకులు, కార్యకర్తలు తరలివచ్చారు. లోకేశ్‌తో సెల్ఫీ కోసం పోటీపడ్డారు. పలువురు వైసీపీ నాయకులు లోకేశ్ సమక్షంలో టీడీపీలో చేరారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి రామ్‌మల్లిక్‌నాయుడు, జడ్పీ మాజీచైర్‌పర్సన్ చౌదరి ధనలక్ష్మి, విజయనగరం జిల్లా టీడీపీ నాయకులు కిమిడి నాగార్జున, జనసేన నాయకులు విశ్వక్‌సేన్, టీడీపీ నాయకులు కలిశెట్టి అప్పల నాయుడు, లావేరు మండల టీడీపీ నాయకులు ముప్పిడి సురేష్, భారీసంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.



వేదికపై టీడీపీ-జనసేన శ్రేణులతో లోకేశ్

తప్పుడు పత్రాలతో భూమిని ఎమ్మెల్యే ఆక్రమించారు..

- లోకేశ్‌కు కిరణ్ కుమార్ బాధితుల ఫిర్యాదు

లావేరు/రణస్థలం, ఫిబ్రవరి 15: ఎచ్చెర్ల నియోజకవర్గం రణస్థలం మండలం కోటపాలెం గ్రామానికి చెందిన వైసీపీ బాధితులు గురువారం లావేరులో యువనేత నారా లోకేశ్‌ను కలిసి తమ సమస్యలను వివరించారు. ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ తప్పుడు పత్రాలతో తమ భూమిని ఆక్రమించారని ఫిర్యాదు చేశారు. కోటపాలెంలో 100 ఎకరాలకు పైగా ప్రభుత్వ భూమి ఉంది. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఈ భూమిని నియోజకవర్గ పరిధిలోని 15 గ్రామాల పేదలకు పంపిణీ చేయాలని నిర్ణయించారు. ఆయా గ్రామస్థులు సొంత ఖర్చులతో ఈ భూమిని చదును చేసేందుకు సిద్ధమయ్యారు. ఈ భూమిని పేదలకు పంపిణీ చేసే లోపు ప్రభుత్వం మారిపోయింది. వైసీపీ అధికారంలోకి వచ్చాక ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ ఈ భూమి పూర్వీకుల ద్వారా తమకు సంక్రమించిదంటూ నకిలీ పత్రాలు సృష్టించి ఆక్రమించారని గ్రామస్థులు వాపోయారు. టీడీపీ అధికారంలోకి వచ్చాక తమకు న్యాయం చేయాలని బాధిత గ్రామాల ప్రజలు లోకేశ్‌కు విజ్ఞప్తి చేశారు. దీనిపై లోకేశ్ స్పందిస్తూ రాష్ట్రంలో భూములు ఎక్కడ ఉన్నా వైసీపీ నేతలు గద్దల్లా వాలిపోతున్నారన్నారు. త్వరలో టీడీపీ-జనసేన ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సంబంధిత భూమిని స్వాధీనం చేసుకుని పేదలకు పంపిణీ చేస్తామని హామీనిచ్చారు.

ప్రచారమే.. పంపిణీ లేదు

ఆరోగ్యశ్రీ కార్డు కలిగిన ప్రతి పేద కుటుంబానికీ స్పెషాల్టీ ఆసుపత్రుల ద్వారా నాణ్యమైన వైద్యాన్ని అందిస్తామని ప్రభుత్వం ప్రచారం చేసింది. రూ.25లక్షల వరకు ఉచిత వైద్యం అందిస్తామని, 3,257 వ్యాధులకు గాను రాష్ట్రంలోని సూపర్‌స్పెషాల్టీ ఆసుపత్రులతో పాటు హైదరాబాద్, చెన్నై, బెంగళూరు వంటి నగరాల్లో కూడా చికిత్స పొందేందుకు ఆరోగ్యశ్రీ కార్డు దోహద పడుతుందని గొప్పలు చెప్పింది. అయితే, కార్డుల పంపిణీలో మాత్రం తడబాటుకు గురైంది. జిల్లాలో సగం మందికి కూడా కార్డులు అందని పరిస్థితి నెలకొంది.

- టెక్కలి మండలం నర్సింగపల్లి సచివాలయంలో 947 కుటుంబాలకు ఆరోగ్యశ్రీ కార్డులు అందాల్సి ఉండగా 633 కుటుంబాలకే వచ్చాయి. మరో 314మంది కుటుంబాలకు పంపిణీ జరగలేదు.

- లింగాలవలస సచివాలయం పరిధిలో 1,079 కుటుంబాలకు గాను 564 కుటుంబాలకు మాత్రమే ఆరోగ్యశ్రీ కార్డులు అందాయి. మరో 515 కుటుంబాలకు నేటికీ అందని పరిస్థితి. మొత్తంగా టెక్కలి మండలంలో 21,255 కుటుంబాలకు గాను 10,356 కుటుంబాలకు మాత్రమే ఆరోగ్యశ్రీ కార్డులు పంపిణీ జరిగింది.

- పేదల దరిచేరని ఆరోగ్యశ్రీ కార్డులు
- జిల్లాలో సగం మందికి కూడా అందని వైనం
- తప్పని ఎదురుచూపులు



(టెక్కలి)

జిల్లాలో ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ నత్తనడకన సాగుతోంది. ఎన్నికలు సమీపిస్తున్న వేళ ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని అధికారపార్టీ ప్రజాప్రతినిధులు, అధికారులు హడావుడిగా ప్రారంభించారు. గ్రామస్థాయిలో వలంటీర్లు ఇంటింటికి వెళ్లి కుటుంబ పెద్ద బయోమెట్రిక్ వేసిన తరువాత కార్డును అందజేస్తున్నారు. అయితే, ఇప్పటివరకు సగం మందికి కూడా కార్డులు అందలేదు. జిల్లాలో ఆరోగ్యశ్రీ కార్డులకు సంబంధించి సుమారు 6,64,115 కుటుంబాల సమాచారం సేకరించాల్సి ఉంది. కానీ, 6,35,115 కుటుంబాల వివరాలు మాత్రమే లభ్యమయ్యాయి. అందులో 3,45,453 కుటుంబాలకు కార్డులు పంపిణీ చేశారు. ఇప్పటివరకు 5.72లక్షల కార్డులు మాత్రమే జిల్లాకు చేరాయి. మరో 92వేలు దరిచేరలేదు. నందిగాం, పొందూరు, లావేరు, పలాస- కాశీబుగ్గ, హిరమండలం, పాతపట్నం, ఎచ్చెర్ల, టెక్కలి, వజ్రపుకొత్తూరు, ఎల్.ఎన్.పేట తదితర మండలాల్లో 50శాతం లోపు మాత్రమే కార్డులు పంపిణీ చేశారు. మిగిలినవి ఎప్పుడు పంపిణీ చేస్తారా? అని ప్రజలు ఎదురుచూస్తున్నారు.

92 వేల కార్డులు రావాలి

జిల్లాకు మూడు విడతలుగా 5.72లక్షల ఆరోగ్యశ్రీ కార్డులు వచ్చాయి. ఇంకా 92వేల కార్డులు రావాల్సి ఉంది. కొంతమంది వలస వెళ్లడం, మరికొందరు చనిపోవడం, ఈకేవైసీ పెండింగ్‌లో ఉండడం తదితర కారణాలతో కొన్ని కార్డులు పంపిణీ జరగలేదు.

- పి.ప్రకాష్, జిల్లా ఆరోగ్యశ్రీ కో-ఆర్డినేటర్


అత్తలు మరణిస్తే.. కోడళ్ల పేర్లు తొలగింపు

- ఓటర్ల జాబితాలో విచిత్రాలు

సరుబుజ్జిలి: సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా ఎన్నికల సంఘం సిద్ధం చేసిన ఓటర్ల జాబితాలో విచిత్రాలు చోటుచేసుకున్నాయి. గత నెల 22 విడుదల చేసిన నమూనా ఓటర్ల జాబితాలో గ్రామస్థాయి అధికారుల నిర్లక్ష్యం తేటతెల్లమైంది. సరుబుజ్జిలి మండలం పోలింగ్ కేంద్రం నెంబర్ 180లోని నందికొండలో కొంతమంది అత్తలు మరణిస్తే.. ఓటర్ల జాబితాలో వారి కోడళ్ల పేర్లు తొలగించారు. నంది కొండకు చెందిన నిర్మల ముచ్చేటి (భర్త లింగరాజు) ఓటర్ల జాబితాలో 19 నెంబర్‌గా ఉంటూ గత ఏడాది మరణించారు. ఈమె పేరుకు బదులు అధికారులు ఓటర్ల జాబితాలో 337 నెంబర్‌తో ఉన్న కోడలు ముచ్చేటి నిర్మలా (భర్త సవరరాజు) ఓటును తొలగించారు. అలాగే మరో అత్త చల్ల సత్యవతి మరణిస్తే కోడలు చల్ల తవిటమ్మను ఓటర్ల జాబితా నుంచి తొలగించిన సంఘటన కూడా చోటుచేసుకుంది. ఇదే ఓటర్ల జాబితాలో 5009 నెంబర్‌తో ఉన్న పొందూరు గడ్డెమ్మ అనే మహిళ మరణించి మూడేళ్లు అయినా ఓటు తొలగించలేదు. ఇచ్ఛాపురం గ్రామానికి చెందిన గాలి పురుషోత్తమరావు అతని భార్య గాలి మీన పశువైద్యశాలలో విధులు నిర్వహిస్తూ 180 పోలింగ్ కేంద్రం నందికొండలో ఓటర్లుగా నమోదయ్యారు. రెండేళ్లు ఇదే గ్రామంలో ఉంటున్న వారికి ఓటు కల్పించిన అధికారులు.. బదిలీపై ఇతర ప్రాంతాలకి వెళ్లి ఐదేళ్లు కావస్తున్నా ఆ ఓట్లను తొలగించకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఇవే కాకుండా నందికొండ సరుబుజ్జిలి 179, 180 పోలింగ్ కేంద్రాల్లో ఉన్న ఓటర్ల జాబితాల్లో రెండు చోట్ల ఓట్లు ఉన్న వ్యక్తులు, ఇతర ప్రాంతాలకు చెందిన వ్యక్తులు ఓటర్లుగానే కొనసాగుతున్నారనే విమర్శలు జోరుగా వినిపిస్తున్నాయి.



నందికొండ ఓటర్ల జాబితాలో తొలగించిన కోడళ్ల పేర్లు



బదిలీపై వెళ్లిన ఉద్యోగులు, మరణించిన గడ్డెమ్మ పేర్లు

నల్లబ్యాడ్జీలతో ఉద్యోగుల నిరసన



నినాదాలు చేస్తున్న ఉద్యోగులు

టెక్కలి, ఫిబ్రవరి 15: ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న నిర్లక్ష్యం, అణిచివేతలపై గురువారం అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలల్లో ఉద్యోగులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘ నాయకులు, ఏపీజేఏసీ ప్రతినిధులు నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. భవిష్యత్ పోరాటానికి సిద్ధంగా ఉండాలని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో గున్న ప్రసాదరావుతో పాటు వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు, ప్రభుత్వ ఉద్యోగులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి



సత్యవరం ఉన్నత పాఠశాలలో ధర్నా చేస్తున్న ఉపాధ్యాయులు

నరసన్నపేట: ఉపాధ్యాయ, ఉద్యోగుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఉపాధ్యాయులు డిమాండ్ చేశారు. గురువారం సత్యవరం ఉన్నత పాఠశాల, తహశీల్దార్ కార్యాలయం వద్ద ఉపాధ్యాయ, ఉద్యోగులు మధ్యాహ్న భోజన విరామ సమయంలో ధర్నా చేపట్టారు. డీఏ, మెడికల్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని... ఉపాధ్యాయులపై ఉన్నతాధికారుల వేధింపులు నిలిపివేయాలన్నారు. కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, సీపీఎస్ విధానం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్జీవోలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చెరువు ఆక్రమణల పరిశీలన



ఆక్రమణలను పరిశీలిస్తున్న రెవెన్యూ సిబ్బంది

హరిపురం: మందస మండలం హరిపురంలో రట్టి రోడ్డు పక్కన పొద్దుమాడి చెరువు ఆక్రమణలను గురువారం వీఆర్‌వో పాండవ గజపతిరావు, సచివాలయ సిబ్బంది పరిశీలించారు. సర్వే నెం 213/20లో సుమారు 15 సెంట్లలో చెరువు ఉంది. కొన్నేళ్లుగా పూడిక పేరుకుపోయి రోడ్డుకు సమాంతరంగా మారింది. దీంతో ఈ చెరువుపై ఆక్రమణదారుల కన్ను పడింది. పునాదులు వేసేందుకు గోతులు తీయగా గ్రామస్థులు అడ్డుకున్నారు. అప్పటికీ తమ పనులు కొనసాగించడంతో సోమవారం మందస తహసీల్దార్‌కు, కలెక్టర్, ఆర్డీవోలకు టీడీపీ నాయకులు బైరిశెట్టి గున్నయ్య తదితరులు ఫిర్యాదు చేశారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వీఆర్వో, సచివాలయ సిబ్బంది పనులను నిలిపివేసి స్థలాన్ని పరిశీలించి నివేదికను కలెక్టర్‌కు, తహసీల్దార్‌కు అందించనున్నట్లు తెలిపారు. పనులు చేపడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

వైభవంగా రథసప్తమి పూజలు



పూజలందుకుంటున్న సూర్యభగవానుడు

టెక్కలి: రథసప్తమి సందర్భంగా స్థానిక సూర్య దేవాలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్నారు. గురువారం అర్ధరాత్రి క్షీరాభిషేకంతో పూజలు ప్రారంభమయ్యాయి. అనంతరం స్వామి వారి నిజరూప దర్శనం కల్పించారు. డివిజన్ కేంద్రమైన టెక్కలి పాత జాతీయ రహదారిపై 1980లో బొంగు సూర్యనారాయణ నిర్మించిన సూర్య భగవానుడి ఆలయం జిల్లాలో రెండోది. రథసప్తమి ఉత్సవాలలో భాగంగా ఆలయ పరిసర ప్రాంతాలన్నీ ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి. భక్తుల కోసం అవసరమైన క్యూలైన్లను నిర్వాహకులు ఏర్పాటు చేశారు. ఈ ప్రాంతంలో సూర్యభగవానుడి ఆలయం ఒక్కటే కావడంతో వేల సంఖ్యలో భక్తులు తరలి వస్తున్నారు. పోలీసులు బందోబస్తు ఏర్పాట్లు చేశారు. భక్తులకు ప్రసాదాలు, తాగునీటి సౌకర్యం కల్పించారు.

ఉద్యోగులకు ఉచిత ప్రమాద బీమా

నరసన్నపేట: ఉద్యోగుల కుటుంబాలకు ఆపద సమయంలో స్టేట్‌బ్యాంకు అండగా ఉంటుందని రీజనల్ మేనేజర్ టి.రామరాజు అన్నారు. నరసన్నపేట ఎస్‌బీఐలో బీమా సదుపాయం ఖాతా కలిగిన సీఆర్‌పీఎఫ్ జవాను లింగుబేరి రవి ప్రమాదంలో మృతి చెందారు. అతని భార్య రోహిణికి గురువారం రూ.50 లక్షల బీమా మొత్తాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగులు వేతనం ఖాతాను కలిగి ఉంటే ఉచిత ప్రమాద బీమా సౌకర్యం కల్పిస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఎం రుప్ప సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఒడియా నాటక దినోత్సవం


● కుమార్ నాయక్‌కు ఉత్తమ భీమసేన్ అవార్డు



అవార్డు అందుకుంటున్న కుమార్‌నాయక్

పలాస రూరల్: బరంపురం ప్రకాశ్‌మహల్‌లో బుధవారం రాత్రి ఒడియా నాటక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆల్ ఒడిశా సీనియర్ ఆర్టిస్టు ఫెడరేషన్ ఆధ్వర్యంలో 'బాణహరణ' అనే పౌరాణిక నాటకాన్ని ప్రదర్శించారు. ఈ నాటకంలో భీముడి పాత్రధారి కుమార్ నాయక్‌కు ఉత్తమ భీమసేన్ అవార్డు అందజేశారు. ఆంధ్ర- ఒడిశా కళాకారులు కలిసికట్టుగా నిర్వహించిన బాణహరణం (బాణాన్ని త్యజించడం) అనే ఈ పౌరాణిక ఘట్టం ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో ఆర్టిస్ట్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి రోషన్ సుభాష్ సాహు, నాట్యశ్రీ ఫౌండేషన్ సంస్థ వ్యవస్థాపకులు భవానీమిశ్రా, ఉత్కళ్ సమాజ్ రాష్ట్ర అధ్యక్షులు తిరుపతి సాహు, రమేష్ మహరణ, రాజేంద్రపతి, బిపిన్‌చంద్ర మహాపతి, శంకర్ సబతో పాల్గొన్నారు.

చిన్నారికి ఉపాధ్యాయుల సాయం



పల్లవిశ్రీకి నగదు అందజేస్తున్న ఎంఈవో

ముప్పిడి(పోలాకి): రాళ్లపాడు పంచాయితీ ముప్పిడి ప్రాథమిక పాఠశాలలో మూడో తరగతి చదువుతున్న గంగుపల్లవిశ్రీ కంటికి వ్యాధి సోకడంతో వైద్యులు ఆ కన్ను తొలగించారు. దీంతో నిరుపేద బాలికకు తమ వంతు సాయంగా ఉపాధ్యాయులంతా విరాళాలు పోగుచేసి రూ.95,500 నగదును గురువారం సాయంత్రం అందజేశారు. ఉపాధ్యాయ సంఘాల నాయకులతో పాటు ఎంఈఓ టి.లింగరాజు, మాజీ సర్పంచ్ చిట్టిపావనీ సింహాచలం బాలిక తల్లిదండ్రులకు నగదును అందజేశారు. బాలికకు ఉన్నత వైద్యచికిత్సతో పాటు, చదువు కొనసాగించడానికి తమ వంతు సహకారం అందిస్తామని ఉపాధ్యాయులు చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ బోర సోమేశ్వరరావు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు చింతాడ దిలీప్‌కుమార్, ధర్మారావు, నరసింహులు, రాజేష్, టి.సుజాత, కామేశ్వరి, సునీల్‌గౌతమ్, రామశంకర్, హెచ్ఎం బి.శ్యామలరావు పాల్గొన్నారు.

ఎన్నికల వేళ అప్రమత్తం: కలెక్టర్



అధికారులకు సూచనలు ఇస్తున్న కలెక్టర్ మన్‌జీర్ జిలానీ సమూన్

నరసన్నపేట, ఫిబ్రవరి 15: ఎన్నికల సమయంలో ప్రతిఒక్క అధికారీ అప్రమత్తంగా ఉంటూ విధులను నిర్వహించాలని కలెక్టర్ మన్‌జీర్ జిలానీ సమూన్ సూచించారు. గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం, సచివాలయాలను ఆయన పరిశీలించారు. కొత్త ఓట్ల దరఖాస్తులను తహసీల్దారులు క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. ఫారమ్-7లను క్షేత్ర స్థాయిలో పరిశీలించాలన్నారు. కొందరు బీఎల్‌వోలకు అవగాహన ఉండడం లేదని... అలాంటి వారికి ఆర్వోలు, ఈఆర్వోలు అవగాహన కల్పించాలని సూచించారు. తహసీల్దార్ కార్యాలయంలో రికార్డుల నిర్వహణ తీరును పరిశీలించారు. మ్యూటేషన్స్ పెండింగ్ లేకుండా చేయాలని సూచించారు. సచివాలయాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేయడంతో సచివాలయ సిబ్బంది ఉక్కిరిబిక్కిరి అయ్యారు. డిగ్రీ, జూనియర్ కళాశాలల్లో పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. అనంతరం ఇంటర్ విద్యార్థులతో మాట్లాడారు. పరీక్షలు బాగా రాయాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్వో రామ్మోహన్‌రావు, తహసీల్దార్ కనకారావు, ఎన్నికల డీటీ సతీష్, ఈవో చిన్నారావు, వీఆర్వోలు పాల్గొన్నారు.

సాగరతీరంలో టీడీపీ ఎన్నికల శంఖారావం



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి

కొత్తరేవు (పోలాకి): సాగరతీర ప్రాంతంలోని వివిధ గ్రామాల్లో గురువారం తెలుగుదేశం పార్టీ నాయకులు ఎన్నికల శంఖారావం పూరించారు. మాజీ ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి తన అనుచరులతో మత్స్యకారులను కలుసుకున్నారు. రానున్న ఎన్నికల్లో తెలుగుదేశం, జనసేన అభ్యర్థులను గెలిపించాలని కోరారు. మత్స్యకారులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకున్నారు. వైసీపీ ప్రజా వ్యతిరేక విధానాలను ఇంటింటికీ వెళ్లి వివరించారు. టీడీపీ మేనిఫెస్టోను ఓటర్లకు తెలియజేశారు. ఆయన వెంట జనసేన పార్టీ ఇన్‌చార్జి బలగ ప్రవీణ్ కుమార్, ఎం.వి.నాయుడు, బైరి భాస్కరరావు, దుష్యంత్, బగ్గు అర్చన, అర్జాల విష్ణు, రాజేశ్వరి, డోల ప్రసాదరావు, వై.లక్ష్మణరావు, కోరాడ నాగరాజు, చిట్టి సింహాచలం, మైలపల్లి త్రినాథ్, మత్స్యకార సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు.

చంద్రబాబునాయుడుతో రాష్ట్రానికి వెలుగులు

జలుమూరు: వచ్చే ఎన్నికల్లో టీడీపీని గెలిపిస్తే రాష్ట్రంలో అభివృద్ధి జాడలు కనిపిస్తాయని టీడీపీ మండల పార్టీ నాయకులు వెలమల రాజేంద్రనాయుడు, కత్తిరి వెంకటరమణ అన్నారు. గురువారం జలుమూరు, సారవకోట మండలాల్లో బాబు ష్యూరిటీ -భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. సూపర్ సిక్స్ కార్యక్రమాల బ్రోచర్‌ను ఇంటింటికీ పంపిణీ చేశారు. సైకిల్‌కు ఓటు వేసి నిరంకుశ పాలనను అంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బగ్గు సునీల్, గోవిందరావు, దుంగ స్వామిబాబు, పంచిరెడ్డి రామచంద్రరావు, సురవరపు తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

చినవంక మాజీ సర్పంచ్ శార్వాణి మృతి



శార్వాణి (ఫైల్)

వజ్రపుకొత్తూరు, ఫిబ్రవరి 15: వజ్రపుకొత్తూరు మండలం చినవంక మాజీ సర్పంచ్ దువ్వాడ శార్వాణి (64) బుధవారం రాత్రి కన్నుమూశారు. ఆమె గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధ పడుతున్నట్లు కుటుంబ సభ్యులు చెప్పారు. పరిస్థితి విషమించడంతో తన స్వగ్రామం గుల్లలపాడులో తుదిశ్వాస విడిచారు. ఆమె 2013-18 మధ్య కాలంలో చినవంక సర్పంచ్‌గా సేవలందించారు. ఆమెకు భర్త, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. పెద్ద కుమారుడు హేమబాబు చౌదరి వజ్రపుకొత్తూరు పీఏసీఎస్ ఛైర్మన్‌గా పనిచేసి.... ప్రస్తుతం తెలుగుదేశం పార్టీలో క్రియాశీలకంగా వ్యవహరిస్తున్నారు. పెద్ద కోడలు విజయలక్ష్మి ప్రస్తుతం చినవంక సర్పంచ్‌గా కొనసాగుతున్నారు. శార్వాణి కుటుంబ సభ్యులకు పలువురు సంతాపం తెలిపారు. మాజీ మంత్రి గౌతుశ్యాంసుందర్ శివాజీ, రాష్ట్ర టీడీపీ కార్యదర్శి వజ్జ బాబూరావు, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్ పీరుకట్ల విఠల్‌రావు, పలాస-కాశీబుగ్గ మున్సిపల్ కౌన్సిలర్ దువ్వాడ శ్రీకాంత్, టీడీపీ అధికార ప్రతినిధి తలగాన నర్సింహమూర్తి నాయుడు, ఏఎంసీ మాజీ వైస్ ఛైర్మన్ వంకల కూర్మారావు, టీడీపీ నాయకులు కొర్ల విష్ణుకుమార్ చౌదరి, ప్రముఖ వైద్యులు దువ్వాడ జీవితేశ్వరరావు, కూన మోహన్‌బాబు, చింతా సుధీర్, కూన పవన్ కుమార్, పొన్నాడ రాంనరేష్ ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం



దుర్గారావు(ఫైల్)

నరసన్నపేట/నందిగాం, ఫిబ్రవరి 15: జాతీయ రహదారిపై తామరాపల్లి ఏపీ గురుకుల పాఠశాల వద్ద గురువారం సంభవించిన రోడ్డు ప్రమాదంలో నందిగాం మండలం శివరాంపురం గ్రామానికి చెందిన నక్క దుర్గారావు (34) మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం నరసన్నపేట నుంచి టెక్కలి వైపు నడిచి వెళుతున్న దుర్గారావు రోడ్డును దాటే సమయంలో గుర్తు తెలియని వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆయన అక్కడికక్కడే మృతిచెందారు. స్థానికుల సమాచారంతో ఏఎస్ఐ అసిరినాయుడు సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. మృతుడి సోదరుడు ఉమాపతి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

శివరాంపురంలో విషాదం

శివరాంపురం గ్రామానికి చెందిన నక్క దుర్గారావు అనే యువకుడు నరసన్నపేట మండలంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో స్వగ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. దుర్గారావు ఉపాధి పనుల కోసమని గురువారం ఉదయం వెళ్లి తిరిగిరాని లోకాలకు వెళ్లిపోవడాన్ని తల్లిదండ్రులు మహాలక్ష్మి, పోలయ్యలు జీర్ణించుకోలేకపోతున్నారు. రోడ్డు ప్రమాద రూపంలో మృత్యువు కబళించడంతో తమకిక దిక్కెవరని వారు కన్నీరుమున్నీరవుతున్నారు. దుర్గారావు మృతి పట్ల స్థానిక సర్పంచ్ సబ్బి జానకిరాం తదితరులు సంతాపం తెలిపారు.

నేడు పరిశ్రమలకు విద్యుత్ అంతరాయం

నందిగాం: నందిగాం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని పరిశ్రమలకు శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏఈ ఎంవీ రమణ తెలిపారు. విద్యుత్ లైన్ మరమ్మతులు, నిర్వహణలో భాగంగా ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు సరఫరా నిలిపివేస్తున్నామని... వినియోగదారులు సహకరించాలని కోరారు.

నేడు వంతెన ప్రారంభం

నందిగాం: నరేంద్రపురం-కణితివూరు మధ్య నారాయణపురం వంశధార కాలువపై నూతనంగా నిర్మించిన వంతెనను శుక్రవారం ప్రారంభించనున్నట్లు ఎంపీపీ ఎన్.శ్రీరామ్మూర్తి తెలిపారు. అనంతరం నందిగాంలో దివంగత సీఎం రాజశేఖరరెడ్డి విగ్రహావిష్కరణ జరుగుతుందని వెల్లడించారు.

విద్యుత్ స్తంభం ఏర్పాటు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



విద్యుత్ స్తంభాన్ని ఏర్పాటు చేస్తున్న సిబ్బంది

హిరమండలం, ఫిబ్రవరి 15: హిరమండలం చిన్నకోరాడ వీధిలోని విద్యానగర్‌లో కొత్తగా విద్యుత్ స్తంభాన్ని ఏర్పాటు చేసి.. విద్యుత్ లైన్లను సరిచేశారు. ఈ నెల 14న నేలపైన వాలుతున్న విద్యుత్ వైర్లపై ఆంధ్రజ్యోతిలో 'ప్రమాదం కాదా' శీర్షికన ప్రచురించిన కథనానికి విద్యుత్ శాఖ అధికారులు స్పందించారు. గురువారం వీధిలో కొత్తగా స్తంభాలను ఏర్పాటు చేసి...విద్యుత్ వైర్లను సరిచేశారు.

సైన్స్‌తోనే సమాజాభివృద్ధి: డీఈవో



వైజ్ఞానిక ప్రదర్శనను తిలకిస్తున్న డీఈవో

టెక్కలి: శాస్త్ర, సాంకేతిక విద్య ద్వారా సమాజానికి ఎంతో మేలు జరుగుతుందని జిల్లా విద్యా శాఖాధికారి కె.వెంకటేశ్వరరావు అన్నారు. ఐతమ్ కళాశాలలో గురువారం జరిగిన 11వ జిల్లా వైజ్ఞానిక ప్రాజెక్ట్ ప్రదర్శన పోటీల్లో భాగంగా ఇన్‌స్పైర్ మనక్ అవార్డు 2022-23 కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రజల సమస్యలకు శాస్త్ర, సాంకేతిక పరిష్కారాలు చూపడమే వైజ్ఞానిక విద్య లక్ష్యమని తెలిపారు. 164 ప్రాజెక్టులు ప్రదర్శనకు రాగా 16 ఉత్తమ ప్రాజెక్టులను రాష్ట్రస్థాయికి ఎంపిక చేసినట్లు తెలిపారు. డైరెక్టర్ వీవీ నాగేశ్వరరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాసరావు, హెచ్‌వోడీ డాక్టర్ శ్రీరాములు, ఎన్ఐఎఫ్ జూనియర్ సైంటిస్ట్ అవినాష్ సమాల్, జిల్లా వైజ్ఞానిక అధికారి కుమారస్వామి ఉపవిద్యాశాఖాధికారి విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

బకాయిలు చెల్లించాలి



ఆందోళన చేస్తున్న రెవెన్యూ ఉద్యోగులు

మెళియాపుట్టి: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గురువారం తహశీల్దార్ కార్యాలయం ఎదుట రెవెన్యూ ఉద్యోగులు నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. రావలసిన బకాయిలు ఇప్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డీటీ శంకర్, ఉద్యోగ సంఘ నాయకులు శ్రవణ్, కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి శంకరగిరి క్షేత్రంలో పూజలు

బొర్రంపేట(ఎల్.ఎన్.పేట): బొర్రంపేట గ్రామంలో శుక్రవారం నుంచి ఐదు రోజుల పాటు బొర్ర శంకరగిరి క్షేత్రం ప్రతిష్ఠోత్సవ కార్యక్రమాలు నిర్వహించను న్నట్టు ఆలయ ధర్మకర్త ఆర్.రుక్మాంగధరావు, సర్పంచ్ బి.రమణమ్మ తెలిపారు.

ముక్తికాంత్ మిశ్రాకు డాక్టరేట్



డాక్టరేట్ అందుకుంటున్న ముక్తికాంత్‌మిశ్రా

పర్లాకిమిడి, ఫిబ్రవరి 15: పట్టణంలోని సెంచూరియన్ విశ్వవిద్యాలయం అధ్యక్షుడు ముక్తికాంత్ మిశ్రాకు ఆస్ట్రేలియాకు చెందిన డైకిన్ విశ్వవిద్యాలయం డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. దేశంలో సెంచూరియన్ విశ్వవిద్యాలయ సంస్థల ద్వారా విద్యా నైపుణ్యాభివృద్ధిని అందిస్తూ విద్యార్థుల భవిష్యత్తుకు బంగారుబాటలు వేస్తున్నందుకు ఈ గౌరవాన్ని అందిస్తున్నట్లు డైకిన్ యూనివర్సిటీ ప్రతినిధులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా సెం చ్యూరియన్ యూనివర్సిటీ ఉపాధ్యక్షుడు ప్రొఫెసర్ డాక్టర్ డీఎన్.రావు, వైస్‌చాన్సలర్ డాక్టర్ సుప్రియపట్నాయక్, డీన్ డాక్టర్ అనితపాత్రో.. ముక్తికాంత్ మిశ్రాకు అభినందనలు తెలిపారు.

ప్రభుత్వ పథకాలపై అవగాహన

ఒడిశా

పర్లాకిమిడి: గుసాని సమితి సర్దాపూర్ గ్రామంలో గురువారం అమోఒడిశా కార్యక్రమం నిర్వహించారు. గుసాని సమితి అధ్యక్షుడు ఎన్.వీర్రాజు, బిజెడీ పార్టీ యువనాయకుడు రూపేష్‌పాణిగ్రాహి, జిల్లా అధ్యక్షుడు లింగరాజు, గజపతిరావు, బాలరాజులు పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధిని వివరించారు. సంక్షేమ పథకాలు అర్హులకు కచ్చితంగా అందుతాయని తెలిపారు. ఈ సందర్భంగా నాయకులను సన్మానించారు.



అమో ఒడిశా కార్యక్రమంలో నాయకులు

శివాలయం ప్రారంభం



పర్లాకిమిడి: గుసాని సమితి నరహరిపూర్ గ్రామంలో గురువారం శివాలయాన్ని ప్రారంభించారు. హైటెక్ విద్యాసంస్థల డైరెక్టర్ రూపేష్‌పాణిగ్రాహి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామస్థులు స్వామివారి తిరువీధి కార్యక్రమం చేపట్టారు.

నేడు న్యాయ విజ్ఞాన సదస్సు

టెక్కలి: స్థానిక జిల్లా కేంద్ర ఆసుపత్రిలో శుక్రవారం మధ్యాహ్నం 2గంటలకు లింగ వివక్ష, పనిచేసే ప్రదేశాల్లో స్త్రీలపై లైంగిక వేధింపులపై న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించనున్నట్లు సీనియర్ సివిల్‌జడ్జి జె.శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సదస్సును విజయవంతం చేయాలని కోరారు.

మార్చి 23న దివ్యాంగుల సమావేశం

టెక్కలి: మార్చి 23న విజయవాడలోని ఐలాపురంలో దివ్యాంగుల హక్కుల జాతీయ వేదిక రాష్ట్ర సమావేశం నిర్వహించనున్నట్లు ఆ సంఘ జిల్లా అధ్యక్షులు ఆవుల వేణుగోపాల్ తెలిపారు. రెండు రోజుల పాటు జరిగే ఈ సమావేశంలో దివ్యాంగులకు సంబంధించిన వివిధ అంశాలపై చర్చించనున్నట్లు తెలిపారు. రాష్ట్ర స్థాయిలో దివ్యాంగుల కొత్త కమిటీలో ఉపాధ్యక్షునిగా తనను ఎన్నుకున్నారని ఆయన తెలిపారు.

విద్యార్థినికి అభినందనలు

పలాస రూరల్: జాతీయ స్థాయి స్కేటింగ్‌లో ప్రతిభ కనబర్చిన సత్యసాయి విద్యావిహార్ విద్యార్థిని తోషిని రాయ్‌ను గురువారం పాఠశాలలో అభినందించి.. ప్రశంసాపత్రం అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ప్రీతి చౌదరి, ట్రస్టు ఛైర్మన్ మల్లా రామేశ్వరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కృత్రిమ అవయవాల పంపిణీ

మందస: మందస వివేకానంద విద్యానికేతన్ పాఠశాల ఆవరణలో విజయనగరం గురుదేవ చారిటబుల్, సొండిపూడి మదర్ వలంటీర్ ఆర్గనైజేషన్ సహకారంతో దివ్యాంగులకు గురువారం కృత్రిమ అవయవాలు, ఉపకరణాలు, ఆర్టీసీ బస్సు పాసులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంఘ సేవకులు గిన్ని తిరుపతిరెడ్డి, సీహెచ్.లక్ష్మణరావు, వివేకానంద విద్యానికేతన్ ప్రిన్సిపాల్ బి.కామేశ్వరరావు పాల్గొన్నారు.

నేటి బంద్‌ను విజయవంతం చేయాలి

మందస: మందస మండలంలో శుక్రవారం తలపెట్టిన భారత పారిశ్రామిక బంద్‌ను విజయవంతం చేయాలని సీఐటీయూ నాయకులు దిలీప్ కుమార్ కోరారు. ఈ బంద్‌లో అన్ని వర్గాల వారు పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. **నరసన్నపేట:** కేంద్ర కార్మిక సంఘాలు, సంయుక్త కిసాన్ మోర్చా తదితర ప్రజా సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం చేపడుతున్న దేశవ్యాప్త పారిశ్రామిక సమ్మెను ప్రతి ఒక్కరూ విజయవంతం చేయాలని ప్రజా సంఘాల ఐక్య వేదిక నాయకులు నేతింటి నీలంరాజు, కిసాన్ మోర్చా నాయకులు బి.భాస్కరరావు పిలుపునిచ్చారు. గోలపేట గ్రామంలో నిరసన కార్యక్రమాలను చేపట్టారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా తీసుకున్న నిర్ణయాలకు వ్యతిరేకంగా చేపడుతున్న బంద్‌ను కార్మికులు, గ్రామీణులు విజయవంతం చేయాలని కోరారు.

సంక్షేమానికి పెద్దపీట

జలుమూరు: మండలంలోని వివిధ గ్రామాల్లో స్థానిక శాసన సభ్యుడు ధర్మాన కృష్ణదాస్ జలజీవన్ మిషన్ కార్యక్రమంలో భాగంగా ఇంటింటి కుళాయిలు, ఆర్‌బీకేలు, బస్‌షెల్టర్లను గురువారం ప్రారంభించారు. గ్రామాల్లో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ప్రభుత్వం పెద్దపీట వేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

రూ.15.30 లక్షలకు మార్కెట్ వేలం పాట

పలాస: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ మార్కెట్ వేలం పాటలను గురువారం మధ్యాహ్నం కమిషనర్ టి.నాగేంద్ర కుమార్, ఛైర్మన్ బళ్ల గిరిబాబు సమక్షంలో నిర్వహించారు. రూ.15.30 లక్షలకు ఏడాది పాటు మార్కెట్ ఆశీల వసూళ్లకు వై.మోహనరావుకు పాటను ఖరారు చేశారు. గత ఏడాది రూ.14.45 లక్షలకు వేలం ఖరారైన విషయం విదితమే. జంతువధ శాలకు రాజేష్ ఖాన్‌కు రూ.45వేలకు వేలం ఖరారైంది. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ గెజిట్ ప్రకారం ఆశీలు వసూలు చేసుకోవాలని, అక్రమాలకు పాల్పడితే తక్షణం రద్దు చేస్తామని స్పష్టం చేశారు. వేలం పాటలో ఆర్ఓ అప్పలస్వామి, ఆర్ఐ అమర్‌నాథ్ పాల్గొన్నారు.

ఒకే రాష్ట్రం.. ఒకే రాజధాని

నరసన్నపేట: ఒకే రాష్ట్రం... ఒకే రాజధాని అమరావతియేనని మాజీ ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. గురువారం 'రాజధాని ఫైల్స్' సినిమా విడుదల సందర్భంగా పార్టీ కార్యాలయం నుంచి సినిమా థియేటర్ వరకు పెద్దఎత్తున ర్యాలీగా వెళ్లారు. జై అమరావతి అంటూ నినాదాలు చేశారు. అనంతరం సినిమాను వీక్షించారు.


లోకేశ్‌కు జ్ఞాపికను అందిస్తున్న టీడీపీ నాయకులు


నియోజకవర్గ పార్టీ ముఖ్య నాయకులతో లోకేశ్ మాటామంతి..


టీడీపీ నాయకులు, కార్యకర్తల సందడి

'శంఖారావం'తో జోష్


అభివాదం చేస్తున్న లోకేశ్

లావేరు/రణస్థలం/ఎచ్చెర్ల: సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న వేళ టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ గురువారం లావేరులో నిర్వహించిన ఎన్నికల శంఖారావం విజయవంతమైంది. దీంతో ఎచ్చెర్ల నియోజకవర్గంలో లోకేశ్ యాత్ర విజయవంతం కావడంతో పార్టీ కేడర్‌లో జోష్ నింపింది. నియోజకవర్గంలోని అన్ని మండలాల నుంచి టీడీపీ నేతలు, కార్యకర్తలు భారీ సంఖ్యలో తరలివచ్చారు. లోకేశ్‌తో సెల్ఫీ కోసం ప్రజలు ఎగబడ్డారు.


డయాస్ కింద తనిఖీలు చేస్తున్న డాగ్ స్క్వాడ్

యువగళంతో సునామీ సృష్టించిన లోకేశ్

● టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు కళావెంకటరావు

లావేరు/రణస్థలం/ఎచ్చెర్ల: యువగళం పేరిట పాదయాత్ర చేపట్టి టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ సునామీ సృష్టించారని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు, నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి కిమిడి కళావెంకటరావు అన్నారు. లావేరులో నిర్వహించిన శంఖారావంలో ఆయన మాట్లాడారు. యువగళంలో ఎన్ని అడ్డంకులు సృష్టించినా 226 రోజులు 3,132 కిలోమీటర్లు పాదయాత్ర చేసి అధికార పార్టీకి ముచ్చెమటలు పట్టించారు. మద్యం నిషేధం చేశాకే ఓట్లు అడుగుతానని చెప్పిన జగన్ మాట తప్పి మడమ తిప్పాడు. కుడిచేత్తో పది ఇచ్చి.. ఎడమచేత్తో వంద కొట్టేస్తున్న జగన్ ప్రభుత్వాన్ని బంగాళాఖాతంలోకి కలపాలి. గత ప్రభుత్వ హయాంలో కేవలం మూడేళ్ల వ్యవధిలోనే రాష్ట్ర వ్యాప్తంగా 25 కి.మీల సిమెంట్ రోడ్లు వేసిన దమ్మున్న నాయకుడు లోకేశ్, ఎచ్చెర్ల నియోజకవర్గంలో 50 వేల ఎకరాలకు సాగునీరు అందించిన అపర భగీరథుడు చంద్రబాబు. వైసీపీ పాలనలో పొలాలకు నీరివ్వని కారణంగా రైతులు 600 కోట్లు నష్టపోయారు. కేవలం రూ.3 కోట్లు ఖర్చు చేసి కాల్వలను ఆధునీకరిస్తే రైతుల వందల కోట్లు పంటను నష్టపోయేవారు కాదు. రాబోయే ఎన్నికల్లో ప్రజలు ఓటు ఆయుధాన్ని సక్రమంగా వినియోగించి అప్రజాస్వామిక, దుర్మార్గపు పాలనకు అంతమొందించాలి. రాష్ట్రాన్ని గాడిలో పెట్టాలంటే చంద్రబాబు నాయకత్వం అనివార్యం. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలను ఆదుకుంటామని ప్రజలకు భరోసా ఇచ్చేందుకు యువనేత మన ముందుకు వచ్చారు.

టీడీపీ-జనసేనతోనే ఉపాధి

● జనసేన పార్టీ ఇన్‌చార్జి విశ్వక్సేన్

లావేరు/రణస్థలం/ఎచ్చెర్ల: రాబోయే ఎన్నికల్లో టీడీపీ-జనసేన పొత్తుతో ప్రజల ముందుకు వెళ్తున్నామని జనసేన ఇన్‌చార్జి విశ్వక్సేన్ అన్నారు. లావేరులో గురువారం నిర్వహించిన శంఖారావంలో ఆయన మాట్లాడారు. ఒక పక్క అభివృద్ధి ప్రదాత చంద్రబాబు, మరో పక్క ప్రజల కోసం పరితపించే పవన్ కల్యాణ్‌తో కలిసి అరాచక పాలన అంతమొందించాలని కలిసి వస్తున్నారు. అరాచక పాలనలో జగన్ రాష్ట్రాన్ని 20 ఏళ్ల వెనక్కి నెట్టాడు. నవరత్నాల పేరిట నవరంధ్రాలు పెట్టాడు. ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ ఇంటింటికీ వచ్చి హామీలు ఇచ్చారు. వాటిలో ఒక్కటి కూడా నెరవేరలేదు. జగన్ పాలనలో మూడేళ్లలో 3 వేల మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారు. మద్యం ద్వారా వచ్చే డబ్బుతో ఎన్నికల్లో ఓట్లు కొనుగోలు చేయాలని చూస్తున్నారు. 2024లో ఎచ్చెర్లలో విజయపతాకాన్ని ఎగురవేస్తాం. అత్యధిక మెజార్టీ కోసమే ఇరుపార్టీలు కార్యకర్తలు కృషిచేయాలి.

'ముప్పిడి' కుటుంబ యోగక్షేమాలపై ఆరా


తాళవలస వద్ద లోకేశ్‌తో కరచాలనం చేస్తున్న దృశ్యం

రణస్థలం: లావేరు మండలంలో శంఖారావం సభ అనంతరం టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ తిరిగి పయనంలో జాతీయ రహదారి తాళవలస వద్ద టీడీపీ సీనియర్ నాయకుడు ముప్పిడి రాము కుటుంబ సభ్యులతో లోకేశ్ కాసేపు ముచ్చటించారు ముప్పిడి రేవతమ్మ ఆశీర్వాదం తీసుకున్నారు.. టీడీపీ రాష్ట్ర మహిళా ప్రధాన కార్యదర్శి ముప్పిడి సుజాత, పిల్లలు పూజిత, లక్ష్మీప్రసన్నల యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఉన్నత చదువులు చదవాలని పిల్లలను ఆశీర్వదించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ఆమదాలవలస: మున్సిపాలిటీ పరిధిలోని రైల్వే అండర్‌టన్నెల్ సమీప ప్రధాన రహదారిపై గురువారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. ఎదురెదురుగా వస్తున్న ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ఘటనలో జరిగిన ఈ ప్రమాదంలో తెలగ మన్నయ్యపేట గ్రామానికి చెందిన జాడ దుర్గారావు ఒకరు కాగా, ఒడిశా రాష్ట్రానికి చెందిన దీపక్‌నాయక్ మరొకరు. స్థానికులు అందించిన సమాచారం మేరకు గాయపడ్డ ఇరువురికి 108 వాహనంలో శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. గాయపడిన ఇద్దరిలో జాడ దుర్గారావుకు తీవ్ర గాయాలయ్యాయి. రక్త స్రావం జరగడంతో పరిస్థితి విషమంగా ఉన్నట్టు స్థానికులు తెలిపారు.

జగన్‌రెడ్డీ.. రాజధాని రైతులంటే ఎందుకంత భయం

● టీడీపీ నాయకుడు గొండు శంకర్

● రాజధాని ఫైల్స్ సినిమా నిలిపివేతపై నిరసన


థియేటర్ ఎదుట నిరసన తెలుపుతున్న గొండు శంకర్ తదితరులు

అరసవల్లి/శ్రీకాకుళం క్రైం: అమరావతిలో రాజధాని నిర్మాణం కోసం వేలాది ఎకరాల భూములిచ్చిన రైతుల జీవితాలను దుర్భరం చేసిందే కాక.. వారు పడ్డ కష్టాలపై తీసిన 'రాజధాని ఫైల్స్' సినిమాపై కూడా వివక్షకు పాల్పడడం అమానుషమని టీడీపీ యువనేత, ఉమ్మడి జిల్లా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు గొండు శంకర్ ప్రభుత్వాన్ని తీవ్రంగా విమర్శించారు. గురువారం స్థానిక కీర్తిక థియేటర్లో రాజధాని ఫైల్స్ సినిమాను పోలీసులు అర్థాంతరంగా నిలిపివేసి ప్రేక్షకులను బయటకు పంపించేశారు. ఈ ఘటనను ఖండిస్తున్నట్టు గొండు శంకర్ తెలిపారు. వైసీపీ ప్రభుత్వ అనుకూల సినిమాలు ప్రజలు చూస్తున్నప్పుడు, ప్రజా సమస్యలపై వచ్చిన సినిమాలను ఎందుకు చూడకూడదని ప్రశ్నించారు. టీడీపీ మాజీ కౌన్సిలర్ అంబటి లక్ష్మీరాజ్యం, ఇప్పిలి తిరుమల, టీఎన్ఎస్ఎఫ్ నియోజకవర్గ అధ్యక్షుడు రెడ్డి శంకర్, ఇంటి శంకర్, బొల్లా నాగేంద్రయాదవ్, కొయ్యాన జగదీష్, గొండు వెంకట రమణ మూర్తి, గొండు శ్యామ్ సుందర్, పేట పద్మ, షేక్ నిజాం, చీపురు రమణ, గురుగుబిల్లి కమలనాథం, పొన్నాడ కిశోర్, మణి, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

కథానిలయంలో తెలుగు భాషా దినోత్సవం

శ్రీకాకుళం కల్చరల్: కథా నిలయంలో గురువారం తెలుగు భాషా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా తెలుగు వెలుగు సాహిత్య వేదిక ప్రతినిధులు కథా నిలయం సందర్శించి కారా మాస్టారు తనయులు కారా సుబ్బారావును కలిసి కథా నిలయం విశేషాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా తెలుగు వెలుగు సాహిత్య వేదిక ప్రధాన కార్యదర్శి మోటూరి నారాయణరావు మాట్లాడుతూ.. కథా నిలయం, కారాపై తెలుగు సాహిత్య వేదిక ఒక సంకలనం తీసుకొచ్చిందని అన్నారు. కథా నిలయం ఏర్పాటు ప్రపంచంలోనే చరిత్రాత్మక విషయమన్నారు. కారా సుబ్బారావు మాట్లాడుతూ.. కథా నిలయం వార్షికోత్సవాలు రెండు తెలుగు రాష్ట్రాల్లో నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ నెల 24న హైదరాబాద్‌లో కథా నిలయం వార్షికోత్సవం నిర్వహించడానికి సన్నాహాలు చేస్తున్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా తెలుగు భాషా దినోత్సవం పోస్టర్లను ఆవిష్కరించారు. మాజీ ఇస్రో శాస్త్రవేత్త డబ్బీరు వెంకట శరత్ కవి, జేవీ కుమార్, అరవల రవీంద్రబాబు, వినోద్, బి.ఉమామహేశ్వర రావు, కథా నిలయం ప్రధాన కార్యదర్శి ఎస్.రామచంద్రరావు పాల్గొన్నారు.

పేదవారికి అండగా సత్యసాయి సేవా సమితి

సోంపేట: మజ్జిపుట్టుగ గ్రామానికి కుమారి సునీత తనకుటుంబాన్ని రోడ్డు ప్రమాదంలో కోల్పోయింది. గ్రామస్థుల సహకారంతో ఈనెల 18న వివాహం జరపనున్నారు. ఈవిషయం తెలుసుకున్న సత్యసాయి సేవాసమితి మహిళలు గురువారం వధువును ఆశీర్వదించి సారె సమాన్లను అందజేశారు. కార్యక్రమంలో మహిళా కన్వీనర్ ఈపరి పూర్ణ, చంద్రిక, ఉట్ల జయలక్ష్మి తదితరులు ఉన్నారు.

8న విశ్వశాంతి బ్రహ్మయజ్ఞం

సోంపేట: శివరాత్రి సందర్భంగా వచ్చే నెల 8వ తేదీన పట్టణంలో నిర్వహించ తలపెట్టిన విశ్వశాంతి బ్రహ్మయజ్ఞం కోసం పలువురు ప్రముఖులకు గురువారం ఆహ్వానపత్రికలు యజ్ఞపరిచాలని సమితి సభ్యులు అందజేశారు. సర్పంచ్ నగిరి ప్రభావతి, ఎంపీపీ నిమ్మన దాసు, యారాడి కృష్ణమూర్తికి అందజేశారు.

పూర్తిస్థాయిలో విద్యా బోధన జరగాలి

ఇచ్ఛాపురం: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా బోధన పూర్తిస్థాయిలో జరగాలని డిప్యూటీ ఎడ్యుకేషనల్ అధికారి విజయకుమారి అన్నారు. గురువారం వెలుగు కార్యాలయంలో పాఠశాలల హెచ్ఎంలతో సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం ప్యానెల్స్‌లో విద్యాబోధన జరగాలని, విద్యార్థులకు అందించిన ట్యాబ్‌లు సక్రమంగా ఉపయోగించుకునేలా చర్యలు చేపట్టాలన్నారు. రికార్డులు, మురుగుదొడ్లు నిర్వహణ సక్రమంగా ఉండాలని ఆదేశించారు. బోధనోపకరణాల వినియోగం, బోధన ప్రణాళిక ఉండాలన్నారు. ప్రభుత్వం అందించిన విద్యా సౌకర్యాలన్నీ విద్యార్థులకు అందే విధంగా పాఠశాల ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంఈవో అప్పారావు, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.


డొంకలపర్త వద్ద నరికి ముక్కలుగా వేసిన భారీ వృక్షాలు

మాయమవుతున్న భారీ వృక్షాలు

బూర్జ: పాలకొండ - శ్రీకాకుళం ప్రధాన రహదారిని ఆనుకొని ఉన్న భారీ వృక్షాలు మాయమవుతున్నాయి. తుడ్డలి, మర్రిపాడు, డొంకలపర్త గ్రామాల సమీపంలో ఉన్న భారీవృక్షాలు రాత్రికి రాత్రే మాయం చేస్తున్నారు. దోచుకోనేందుకు కాదేదీ అనర్హం అన్నట్టుగా భారీ చెట్లను సైతం నరికివేసి తరలించుకుపోతున్నారు. ఇంత జరుగుతున్నా యంత్రాంగం నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరించడం శోచనీయం. ఇప్పటికైనా అధికారులు స్పందించి అక్రమార్కులపై చర్యలు చేపట్టాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.


పొందూరు: లైదాంలో టీడీపీ నాయకుల ప్రచారం


అరసవల్లి: నగరంలో మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి ఆధ్వర్యంలో..

లైదాంలో 'బాబు ష్యూరిటీ'

పొందూరు: వైసీపీ ప్రభుత్వ దుర్మార్గాలు, వైఫల్యాలతో దివాలాతీసిన రాష్ట్రాన్ని గాడిలో పెట్టగలిగే నాయకుడు చంద్రబాబేనని మండల టీడీపీ అధ్యక్షుడు సీహెచ్ రామ్మోహన్, లైదాం సర్పంచ్ గొర్లె అనంతరామకృష్ణ అన్నారు. లైదాం గ్రామంలో గురువారం బాబు ష్యూరిటీ- భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి టీడీపీ అమలుచేయబోయే సంక్షేమ పథకాలు వివరించారు. తెలుగు యువత జిల్లా ప్రధానకార్యదర్శి బలగ శంకరభాస్కర్, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

శ్రీకాకుళం నగరంలో..

అరసవల్లి: మాజీ ఎమ్మెల్యే, టీడీపీ శ్రీకాకుళం నియోజకవర్గ ఇన్‌చార్జి గుండ లక్ష్మీదేవి నగరంలోని దమ్మలవీధి (38వ డివిజన), 40వ డివిజన్‌లో గురువారం 'బాబు ష్యూరిటీ- భవిష్యత్తు గ్యారెంటీ' కార్యక్రమాన్ని నిర్వహించారు. డివిజన్‌లో ప్రతీ ఇంటికీ వెళ్లి సూపర్ సిక్స్ పథకాలను వివరించారు. కార్యక్రమంలో నగర తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు మాదారపు వెంకటేష్, డివిజన్ ఇన్‌చార్జీలు కొమర కమల, మైలపల్లి రాజు, మాడుగుల చంద్రశేఖర్, కోరాడ హరగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

భక్తితోనే ప్రశాంతత


పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే బెందాళం అశోక్

ఇచ్ఛాపురం: భక్తిద్వారానే మనిషికి ప్రశాంత కలుగుతుందని ఎమ్మెల్యే బెందాళం అశోక్ అన్నారు. ఈదుపురంలో ఉదాస్ గురు ఆశ్రమంలో జరుగుతున్న అష్టప్రహరీనామ యజ్ఞంను గురువారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భక్తిలోనే ముక్తి ఉందని, ప్రతీ ఒక్కరూ దైవ చింతనను అలవరుచుకోవాలని అన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ దక్కత డిల్లీరావు, ఎస్.సహదేవు, డి.కామేశ్వరరావు, ఎ.ఈశ్వరరావు, బోర ప్రసాద్, కెత్రవాసి బెహరా, వసంత బెహరా, త్రినాథ్ బెహరా, యవకులు, పాల్గొన్నారు.

కొనసాగుతున్న బెంతు ఒరియాల నిరసన


నిరసన తెలుపుతున్న బెంతు ఒరియాలు

కవిటి: బెంతు ఒరియా కులస్థులు కుల ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేసి తమకు న్యాయం చేయాలని కవిటిలో జరుపుతున్న దీక్ష కొనసాగుతుంది. 50 రోజులుగా నిరసన దీక్షలో కూర్చొని తమకు న్యాయం చేయాలని కోరుతున్నా నాయకులు, అధికారులు పట్టించుకోకపోవడం తగదన్నారు. కుల గుర్తింపు లేకుండా విద్యార్థులు చదువులు కొనసాగక తీవ్రంగా నష్టపోతున్నారన్నారని వాపోతున్నారు. గురువారం ప్రదానపుట్టుగకు చెందిన గ్రామస్థులు కూర్చొని తమ నిరసన తెలియజేశారు. నిరసనలో చంద్రశేఖర్ బిసాయి, అభిమన్యు బిసాయి, సుమన్ బిసాయి, హైమావతి బిసాయి, జగన్ బిసాయి తదిరులు పాల్గొన్నారు.

రక్తదానానికి ముందుకు రావాలి

ఎచ్చెర్ల: రక్తదానం చేసేందుకు స్వచ్ఛందంగా ముందుకు రావాలని స్కై కాలేజ్ ఆఫ్ అగ్రికల్చర్ సైన్సెస్ కళాశాల డైరెక్టర్ బుడుమూరు శ్రీరామ్మూర్తి అన్నారు. ఎస్ఎస్ఆర్ పురంలోని వ్యవసాయ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో గురువారం రెడ్‌క్రాస్ సహకారంతో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడారు. రానున్న వేసవిలో రక్త నిల్వలు కొరత ఉండే అవకాశం ఉన్న దృష్ట్యా రక్తదానంలో యువత భాగస్వామ్యం కావాలన్నారు. కళాశాల అసోసియేట్ డీన్ కె.మోషె మాట్లాడుతూ.. విద్యార్థి దశ నుంచే సామాజిక స్ఫూర్తి అవసరమని చెప్పారు. ఈ శిబిరంలో 60 మంది విద్యార్థులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో జిల్లా రెడ్‌క్రాస్ అధ్యక్షుడు పి.జగన్మోహనరావు, ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త జి.హర్షవర్ధన్, లైన్స్ క్లబ్ (అరసవల్లి) అధ్యక్షుడు హారికా ప్రసాద్, జాతీయ యువజన అవార్డు గ్రహీత పెంకి చైతన్యకుమార్ తదితరులు పాల్గొన్నారు.

'విమర్శించే స్థాయి పిల్ల తమ్మినేనికి లేదు'


విలేకరులతో మాట్లాడుతున్న విద్యాసాగర్

ఆమదాలవలస: పరిపాలన దక్షతకు మారుపేరైన టీడీపీ అధినేత చంద్రబాబును విమర్శించే స్థాయి పిల్ల తమ్మినేనికి లేదని ఆ పార్టీ న్యాయ విభాగం కార్యదర్శి తమ్మినేని విద్యాసాగర్ అన్నారు. గురువారం స్థానిక పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. స్పీకర్ తనయుడు చంద్రబాబు, లోకేశ్, కూన రవికుమార్‌పై చేసిన ఆరోపణలపై ఆయన ధ్వజమెత్తారు. విమర్శించే ముందు తన స్థాయిను తెలుసుకోవాలన్నారు. నారా లోకేశ్ పంచాయతీరాజ్‌శాఖ మంత్రిగా ఉన్నప్పుడు రవికుమార్ చొరవతో పొందూరు మండలంలో రహదారులు అభివృద్ధికి రూ.44 కోట్లు మంజూరు చేస్తే ఆ రహదారులపై నేడు నిర్వహణ పనులు చేస్తూ వైసీపీ ప్రభుత్వం రోడ్లు వేసిందని అబద్ధపు ప్రచారాలు మానుకోవాలన్నారు. ఆమదాలవలస మున్సిపాలిటీలో టీడీపీ ఆధ్వర్యంలో రూ.242 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు చేపడితే మున్సిపాలిటీకి వచ్చిన 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.10 కోట్లు ఎటువంటి అభివృద్ధికి నోచుకుండా వెనక్కి వెళ్లిపోయాయన్నారు. రవికుమార్ స్వగ్రామమైన పెనుబర్తి అభివృద్ధిపై విమర్శలు చేయడం దెయ్యాలు వేదాలు వల్లించినట్టు ఉందని విమర్శించారు. టీడీపీ నాయకులు గోవిందరావు, మొదలవలస రమేష్, నూకరాజు పాల్గొన్నారు.

ఆత్మవిశ్వాసంతో విజయాలు సాధించాలి

సరుబుజ్జిలి: ఆత్మవిశ్వాసంతో విద్యార్థులు విజయాలు సాధించాలని జడ్పీ ఉన్నత పాఠశాల హెచ్ఎం దూసి సూర్యవిజయ భరద్వాజ్ అన్నారు. సరుబుజ్జిలిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రత్యేక కార్యక్రమంలో భరద్వాజ్ మాట్లాడారు. జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో విద్యార్థులకు పరీక్షల్లో మంచి మార్కులు సాధించడం, జీవితంలో ఉన్నత శిఖరాలకు చేరుకోవడం అనే అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. భరద్వాజ్ మాట్లాడుతూ తాను ఏడో ఏటనే కంటిచూపును కోల్పోయానని, తల్లిని ఒంటరి చేసి కన్నతండ్రి వెళ్లిపోయినా కుంగిపోకుండా విజయం సాధించానని విద్యార్థులకు స్ఫూర్తి కలిగించారు. కళాశాల ప్రిన్సిపాల్ రాబిల్లి భూషణరావు, ఎన్ఎస్ఎస్ పీవో రమేష్‌సాహు, అధ్యాపకులు ఎం.నాగేంద్ర, రామకృష్ణ, లైబ్రేరియన్ ఆకెళ్ల రామారావు, శ్రీనివాసరావు, వినోద్‌రాజు, విజయ, సంగీత, విజయ్, గౌతమి, తారాచంద్, సీనియర్ అసిస్టెంట్ కమలాకర్, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.

ఉద్యోగమేళాలో 171 మంది ఎంపిక

ఎచ్చెర్ల: ఏపీఎస్ఎస్‌డీసీ ఆధ్వర్యంలో గురువారం శివానీ ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించిన మెగా ఉద్యోగ మేళాలో 509 మంది హాజరుకాగా, 171 మంది ఎంపికయ్యారు. ఈ మేళాలో 14 ప్రైవేట్ సంస్థల ప్రతినిధులు హాజరై.. అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించి ఎంపిక చేశారు. జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి కె.సుధ మాట్లాడుతూ.. ప్రభుత్వం పోర్టల్ వివరాలు నమోదు చేసుకుంటే నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు ఎక్కువగా వస్తాయని చెప్పారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి పీటీ సాయిశ్రీనివాస్ మాట్లాడుతూ.. ఈ ఇంటర్వ్యూల్లో ఎంపిక కాని అభ్యర్థులు స్కిల్ హబ్ ట్రైనింగ్ కేంద్రాల్లో చేరి నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలన్నారు. జిల్లాలోని ఎనిమిది నియోజకవర్గాల్లో ఈ కేంద్రాలు పనిచేస్తున్నాయని చెప్పారు. సెట్‌శ్రీ సీఈవో ప్రసాదరావు, కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, జిల్లా టూరిజం అధికారి నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

రేపు నగరంలో జాబ్‌మేళా

అరసవల్లి: నగరంలోని డీఎల్‌టీసీ ఐటీఐ, ప్రభుత్వ ఆసుపత్రి జంక్షన్ దగ్గర జిల్లా ఉపాధి అధికారి వారి ఆధ్వర్యంలో ఈ నెల 17వ తేదీన జాబ్ మేళా నిర్వహిస్తున్నట్టు జిల్లా ఉపాధి అధికారి కె.సుధ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇంటర్, డిగ్రీ విద్యార్హత కలిగి 18 నుంచి 35 సంవత్సరాల మధ్య వయసు కలిగిన యువతీ యువకులు ఉదయం 10.30 గంటలకు తమ బయోడేటా, సర్టిఫికెట్లు, ఆధార్ కార్డు తీసుకుని హాజరు కావాలన్నారు. అభ్యర్థులు తమ వివరాలను డబ్లుడబ్లుడబ్లు. ఎన్‌సీఎస్.జీవోవీ.ఐఎన్ వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలన్నారు.

షిర్డీసాయికి పూజలు

ఇచ్ఛాపురం: పురుషోత్తపురం పుష్పగిరి కొండపై కొలువుదీరి ఉన్న షిర్డీసాయికు భక్తులు ప్రత్యేక పూజలు జరిపారు. గురువారం ఉదయం ప్రత్యేక అభిషేకాలతో పాటు కుంకుమార్చనలు జరిపించారు. మధ్యాహ్నం ఖాగడ హారతిలో భక్తులు భారీగా పాల్గొన్నారు. అనంతరం మధ్యాహ్నం ఆలయ ప్రాంగణలో ఏర్పాటు చేసిన అన్నసంతర్పనలో భక్తులు పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

ఆమదాలవలస: కొత్తవలస గ్రామంలోని యూనియన్ బ్యాంక్ వారి సౌజన్యంతో ఎస్ఎస్‌టీ ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యతపై గురువారం అవగాహన కల్పించారు. సైబర్ మోసాలపై టోల్‌ఫ్రీ నెంబర్ 1930కి కాల్ చేయాలన్నారు. ఆన్‌లైన్ లావాదేవీలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో సీఎఫ్ఎల్ సిబ్బంది చిన్నా, రామారావు, సీసీ రమణ తదితరులు ఉన్నారు.

రైతుల డిమాండ్లు నెరవేర్చాలి

ఆమదాలవలస: రైతుల డిమాండ్లను కేంద్ర ప్రభుత్వం తక్షణమే అమలు చేయాలని రాష్ట్ర కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి సనపల అన్నాజీరావు గురువారం డిమాండ్ చేశారు. ఢిల్లీ సరిహద్దుల్లో నిరసన తెలుపుతున్న రైతుల డిమాండ్లను తక్షణమే కేంద్ర ప్రభుత్వం అమలు చేయాలన్నారు. ఆనాడు దేశ రాజధాని సరిహద్దుల్లో మూడు నల్లచట్టాల రద్దు కోసం రైతులు చేసి పోరాటాల్లో రైతులతో మంతనాలు జరిపిన ప్రభుత్వం నేటికీ అమలు చేయకపోవడంతో రైతులు పోరుబాట పట్టారన్నారు.

కార్మిక కుటుంబానికి ఆర్థిక సాయం

రణస్థలం: స్థానిక యూబీ పరిశ్రమలో పనిచేసిన కార్మికుడు ఎస్.మాలచ్చి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో తోటి కార్మికులు ఒక్క రోజు వేతనం రూ.2,40,105 గురువారం మృతుడు కుటుంబ సభ్యులకు సీటూ నాయకులు సీహెచ్ అమ్మన్నాయుడు చేతుల మీదగా అందజేశారు. కార్మికులంతా ఐక్యంగా ఉండాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఐ.నారాయణరావు, జె.గంగరాజు, పి.సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

విలేకరులపై దాడులు బాధాకరం

రణస్థలం: ప్రజలకు, ప్రభుత్వాలకు వారదులుగా ఉంటున్న విలేకరులపై దాడులు చేయడం బాధాకరమని ఏపీ మాల మహానాడు అధ్యక్షుడు కేసీ చెన్నయ్య అన్నారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. వైసీపీ ప్రభుత్వం ఏర్పడ్డాక ప్రతిపక్షాలపై, ప్రజా సంఘాలపై, ఉద్యోగులుపై కక్షసాధింపులకు పాల్పడుతున్నారని విమర్శించారు. దళితులకు సంబంధించిన 29 పథకాలను ఈ ప్రభుత్వం రద్దు చేసిందన్నారు. రానున్న ఎన్నికల్లో జగన్‌రెడ్డి ప్రభుత్వాన్ని గద్దెదించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో దళిత నాయకుడు కుప్పిలి సీతప్పడు, కొయ్యాన నరసియ్య తదితరులు ఉన్నారు.

నేటి నుంచి ఆలయాల ప్రారంభోత్సవాలు

కవిటి: ముత్యాలపేట గ్రామంలో కొత్తగా నిర్మించిన ఎనిమిది ఆలయాల ప్రారంభోత్సవం శుక్రవారం నుంచి ప్రారంభం కానున్నాయని గ్రామస్థులు తెలిపారు. ఐదు రోజులపాటు నిర్వహించే ఈ కార్యక్రమంలో మహామృత్యుంజయ ఆలయంలో ఏకాదశి రోజున విగ్రహ ప్రారంభోత్సవం జరుగుతుందని భక్తులు పాల్గొని స్వామివారి తీర్థ ప్రసాదాలు స్వీకరించాలను గ్రామస్థులు కోరారు.

ఘనంగా ఎల్లమ్మ ఉత్సవాలు

కంచిలి: కొన్నాయిపుట్టుగ గ్రామంలో జామిఎల్లమ్మ ఉత్సవాలు ఘనంగా జరుగున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఎమ్మెల్యే బెందాళం అశోక్, మాజీ ఎమ్మెల్యే పిరియా సాయిరాజ్ ఎల్లమ్మ ఉత్సవాల్లో పాల్గొని పూజలు జరిపారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక

జి.సిగడాం: రాష్ట్ర స్థాయి సైన్స్ ఫెయిర్ పోటీలకు స్థానిక కేజీబీవీ విద్యార్థిని ఎస్.ఇందు ఎంపికైనట్టు పాఠశాల ప్రత్యేకాధికారిణి ఉషారత్నకుమారి తెలిపారు. గురువారం టెక్కలి ఐతమ్ ఇంజనీరింగ్ కళాశాలలో జిల్లా స్థాయి సైన్స్ ఫెయిర్‌లో ప్రతిభ కనపరచి రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్టు తెలిపారు. కేజీబీవీలో ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతున్న ఇందును ప్రత్యేకాధికారిణితో పాటు ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు.